క్లుప్తంగా

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా మరోమారు కరువు వాతన పడిందన్నారు. ఈ నెల 6న జిల్లాలో నెలకొన్న కరువును పరిశీలించడానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేసు, హరినాథ్ రెడ్డి రానున్నట్లు తెలిపారు. 6న కడపలో జరగనున్న కార్మిక కర్షక సదస్సుకు సీపీఐ సంపూర్ణ సంఘీభావాన్ని తెలియజేస్తున్నదన్నారు.

8న విద్యాసంస్థల బంద్

వైవీయూ : కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం పూర్తిచేయాలని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను ఆపాలంటూ ఈనెల 8వ తేదీన విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి. దస్తగిరి పేర్కొన్నారు. శనివారం వైవీయూలోని సర్ సీవీ రామన్ సైన్స్ బ్లాక్ వద్ద డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వి. శివకుమార్‌తో కలిసి బంద్ పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యను కలిసి బంద్‌కు సహకరించాలని వినతిపత్రం అందజేశారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

కడప కల్చరల్ : కడప నగర పరిధిలోని జయరాజు గార్డెన్స్‌లో ప్రముఖ గ్యాస్ట్రో అండ్ లివర్ స్పెషలిస్టు కృష్ణ కార్తీక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఈ శిబిరం కొనసాగనుంది. ఆంధ్రప్రదేశ్ ఫోటో అండ్ వీడియో వెల్ఫేర్ అసోసియేషన్ కడప ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అదే వేదికపై నిర్వహించనున్న కెనాన్ కెమెరా వర్క్‌షాప్‌లో భాగంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారు.

దుస్తుల పంపిణీ

కడప ఎడ్యుకేషన్ : కడప పట్టణం మరియాపురంలోని సెయింట్ జోసెఫ్ బాలికల పాఠశాల, బుగ్గలేటిపల్లెలోని ఆర్‌సీఎం ప్రాథమిక పాఠశాలలకు చెందిన 542 మంది విద్యార్థులకు శనివారం ఉచితంగా దుస్తులను పంపిణీ చేశారు. పోరుమామిళ్లలోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీతా, చిత్తా తోమస్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో వారి ప్రతినిధి ప్రసాద్‌రెడ్డి క్రిస్మస్, నూతన సంవత్సర పండుగల సందర్భంగా ఈ దుస్తులను విద్యార్థులకు అందచేశారు.

ప్రశాంతంగా ఇంటర్వ్యూలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప అర్బన్ డివిజన్ పరిధిలోని కడప అర్బన్, రూరల్, కమలాపురం, సిద్దవటం ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో అంగన్వాడీ వర్కర్లు, ఆయా పోస్టులకు శనివారం ప్రశాంతంగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. కడప ఆర్డీఓ మధుసూదన్ మాట్లాడుతూ ముగ్గురు వర్కర్లు, 30 మంది హెల్పర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓలు సునంద, రమాదేవి, వసంత పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్లుగా రాణించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ పరిధిలోని కడప డిపోలో హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్ స్కూలులో శిక్షణ పొందిన డ్రైవర్లు వృత్తిలో రాణించాలని కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం 17వ బ్యాచ్ శిక్షణ పూర్తయిన అభ్యర్థులకు ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ పర్సనల్ మేనేజర్ గజలక్ష్మి, జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి, కడప డీఎం డిల్లీశ్వరరావు, డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని గీతికాంజలిని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

కడప సిటీ : అండర్–14 బాస్కెట్‌బాల్ బాలికల విభాగంలో గీతికాంజలి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు నాగార్జున మోడల్ స్కూల్ చైర్మన్ శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవిలు తెలిపారు. కడపలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో తమ స్కూలు విద్యార్థిని గీతికాంజలి ప్రతిభచాటడం పట్ల వారు ఆనందం వ్యక్తం చేశారు. ఆ విద్యార్థిని పలువురు అభినందించారు.

వేడుకగా ఫ్రెషర్స్ డే



ఆటలపోటీలలో రాణించిన విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నూతనంగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ బి. శ్రీనివాసులు, కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు మాట్లాడారు. అనంతర ఆటపాటల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు , విద్యార్థులు పాల్గొన్నారు.

కూడళ్లను అందంగా నిర్మించాలి

కడప కార్పొరేషన్ : కడప నగరంలో పునర్నిర్మిస్తున్న ఏడురోడ్ల కూడలి, కోటిరెడ్డి సర్కిళ్లను అందంగా నిర్మించాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ అన్నారు. శనివారం ఆయన మార్నింగ్ విజిట్‌లో భాగంగా పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఏడు రోడ్ల కూడలిలో ఫౌంటేన్ ఏర్పాటు చేయాలని, సివిల్ వర్క్, ఎలక్ట్రికల్ వర్క్‌లను వెంటనే ప్రారంభించాలన్నారు. ఈట్ స్ట్రీట్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. భగత్ సింగ్ పార్క్ వెనుక వైపు పార్కింగ్ ఏరియా ఏర్పాటు చేసి, గ్రీనరీ పెంచాలన్నారు. శాస్త్రి నగర్ పార్కులోని ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని విద్యుత్ శాఖ సిబ్బందిని ఆదేశించారు. నవంబర్‌లోపు పార్కు పనులను పూర్తి చేయాలన్నారు. అక్కాయపల్లె పార్కులో పచ్చదనాన్ని పెంచాలని, రోలర్ మెషీన్‌తోనే రోలింగ్ చేయించాలన్నారు. ప్రతి మొక్కను జాగ్రత్తగా కాపాడాలన్నారు. క్యాంటీన్, పార్కింగ్ ఏరియా నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆయన సాయిపేట, రూకవారిపల్లె, మున్సిపల్ హైస్కూల్ మెయిన్, మున్సిపల్ ఉర్దూ బాలుర పాఠశాల, అంధుల పాఠశాల, జయనగర్ కాలనీ జెడ్పీ స్కూల్‌ను తనిఖీ చేశారు. బూత్ లెవెల్ ఆఫీసర్లు పోలింగ్ స్టేషన్లలో ఉండి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎవరైనా గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంధుల పాఠశాల పై కప్పునకు, మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ కార్పొరేటర్ పాకా సురేష్, 44వ డివిజన్ ఇన్‌చార్జి రామక్రిష్ణారెడ్డి, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.



అక్కాయపల్లె పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి

కడప అర్బన్ : కడప నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేసేందుకు కృషి చేస్తున్నామని, అందులో భాగంగా బారికేడ్లు, కోన్స్, స్టాపర్స్ ఎంతో ఉపయోగపడతాయని కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ అన్నారు. శనివారం కడప నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్ సమీపంలో కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తయారు చేయించిన నో పార్కింగ్ బోర్డ్స్, టూ వీలర్ అండ్ ఫోర్ వీలర్ పార్కింగ్, సైన్ బోర్డ్స్ 100, కోన్స్ 100, స్టాపర్స్ 200 లను ఏర్పాటు చేశారు. వాటిని కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ శనివారం మధ్యాహ్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు, రోడ్డు ప్రమాదాల నియంత్రణకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మైనర్లకు వాహనాలను ఇవ్వరాదన్నారు. రికార్డులు లేకుండా వాహనాలను నడిపితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. దాదాపు రూ.15,86,274లను ఖర్చుచేసి కోన్స్, స్టాపర్స్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కడప ట్రాఫిక్ సీఐ సీతారామరెడ్డి, కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు, చిన్నచౌక్ సీఐ నరసింహారెడ్డి, కమాండ్ కంట్రోల్ సీఐ వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఎస్ఐ వెంకటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో ఉపయోగపడే కోన్స్, స్టాపర్స్‌ను ప్రారంభిస్తున్న కడప డీఎస్పీ ఎండీ షరీఫ్

అవినీతి రహిత సమాజానికి కృషి చేద్దాం

కడప సెవెన్‌రోడ్స్ : అవినీతి రహిత సమాజాన్ని నిర్మించడం అందరూ తమ సామాజిక బాధ్యతగా గుర్తించాలని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీరు జీవీ శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయంలో శనివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కడప యూనిట్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఉద్యోగులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో దుర్వినియోగాన్ని అరికట్టాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేసి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. పథకాలు అర్హులకు మాత్రమే అందేలా చూడాలన్నారు. సహజ వనరులను సంరక్షించుకుంటూ వాటిని భావి తరాలకు అందించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. విజిలెన్స్ సీఐ రెడ్డెప్ప, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ వీరన్న, పంచాయతీరాజ్ డీఈ జవహర్‌రెడ్డిలు మాట్లాడుతూ ఆహార పదార్థాల తయారీలో కల్తీలను అరికట్టాలన్నారు. కలుషిత ఆహారాన్ని తీసుకోవడం వల్ల ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయన్నారు. ప్రభుత్వ ఆదాయం పెరిగితే వసతుల కల్పన మెరుగు పడుతుందన్నారు.



మాట్లాడుతున్న ఎఆర్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి

నెట్, సెట్ పరీక్షలు నిర్వహించాలి

వైవీయూ : విశ్వవిద్యాలయంలో భర్తీ చేయనున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తిగా ఏపీపీఎస్సీకి అప్పజెప్పాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వి.శివకుమార్ కోరా రు. శనివారం వైవీయూలో ఆయన మాట్లా డుతూ సెట్, నెట్ పరీక్ష నిర్వహించిన అనంతరం నియామక ప్రక్రియను ప్రారంభించాలన్నారు. తద్వారా చాలా మంది నిరుద్యోగ అభ్యర్థులకు అవకాశం లభిస్తుందన్నారు. అదే విధంగా టీచింగ్ అసిస్టెంట్‌లకు 10 మార్కులు వెయి టేజి ఇవ్వడం ద్వారా నిరుద్యోగులకు నష్టం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నగర అధ్యక్షుడు షకీర్, సురేష్ పాల్గొన్నారు.

7న ఇంటర్వ్యూ

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బయోటెక్నాలజీ విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులకు ఈనెల 7వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషా తెలిపారు. ఎంఎస్సీ బయోటెక్నాలజీలో కనీసం 60 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. ఏపీసెట్, నెట్, పీహెచ్‌డీ తదితర అర్హతలు ఉన్న మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.

రేనాటి సూర్యచంద్రుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : త్యాగం, దాతృత్వానికి ప్రతీకలై రేనాటి సూర్యచంద్రులుగా ప్రసిద్ధులైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి విగ్రహాలను కడప నగరంలో ఏర్పాటు చేయాలని రెడ్డి సేవా సమితి ఆర్గనైజింగ్ సెక్రటరీ పద్మప్రియ చంద్రారెడ్డి, జానమద్ది సాహితీపీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్, దళితమిత్ర వ్యవస్థాపక అధ్యక్షులు కె.రామాంజనేయులు, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజులు కోరారు. శనివారం వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో వివిధ ప్రజా సంఘాలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సిపాయిల తిరుగుబాటుకు పదేళ్ల ముందే నరసింహారెడ్డి బ్రిటీషర్లతో సాయుధ తిరుగుబాటు జరిపి ఉరికొయ్యను ముద్దాడారన్నారు. బుడ్డా వెంగళరెడ్డి 1866 నాటి భయంకర కరువులో వేలాది మంది పేదలకు కొన్ని నెలలపాటు అన్నం పెట్టి ప్రాణాలు కాపాడారన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ నగరంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న కూడళ్లలో భావితరాలకు స్ఫూర్తినిచ్చే వీరి విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సాక్షాత్కారం రచయిత కేవీ రమణారెడ్డి, పర్యాటక ఫోటోగ్రాఫర్ గొబ్బూరి కోటేశ్వరరావు, వినోద్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జానమద్ది విజయభాస్కర్

విద్యుత్ శాఖ ఉద్యోగికి గాయాలు

కడప కార్పొరేషన్ : విద్యుత్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షేక్ గౌస్ బాషా రోడ్డు ప్రమాదానికి గురై గాయలపాలయ్యాడు. కడప నగరానికి చెందిన గౌస్ బాషా తాను పనిచేస్తున్న వల్లూరుకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా మార్గమధ్యంలో ఆవును ఢీకొని కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో గౌస్ బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం ఆయన్ను రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలి

కడప అర్బన్ : పిల్లలు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ, జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్ అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కడప నగరం చిన్నచౌక్‌లో వున్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలురు)ను శనివారం సందర్శించారు. పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. వంట గదులను, వసతి గదులను పరిశీలించారు. మధ్యాహ్నం సమయంలో పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్‌లను పరిశీలించారు. పిల్లల విద్య, ఆరోగ్య విషయాలపట్ల తగిన జాగ్రత్తలు వహించాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలుంటే సంస్థ దృష్టికి తీసుకుని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏ. మణికుమారి, వార్డెన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి ప్రదీప్‌కుమార్

స్నేహపూర్వక సేవలు అందించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : బ్యాంకు సిబ్బంది ప్రజలకు స్నేహ పూర్వక సేవలు అందిస్తూ నిజాయితీగా విధులు నిర్వర్తించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్ఎస్‌వీ కృష్ణారావు పిలుపునిచ్చారు. శనివారం కడప నగరంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో అవినీతికి వ్యతిరేకంగా అవగాహన వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ సిబ్బంది చేత అవినీతికి వ్యతిరేకంగా ప్రమాణం చేయించారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ కరోనా సమయంలో బ్యాంకు సిబ్బంది అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. బ్యాంకు సీఈఓ, జనరల్ మేనేజర్ సంజీవప్ప మాట్లాడారు. ఈ సమావేశంలో బ్యాంకు జీఎంలు రాజేంద్రన్, గిరి, చీఫ్ మేనేజర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అడిషనల్ ఎస్పీ ఎస్ఎస్‌వీ కృష్ణారావు

సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : వివిధ వ్యాధులతో బాధపడేవారు సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు డాక్టర్ జ్యోతిష్, డాక్టర్ కారుణ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్న లత తెలిపారు. శనివారం నగరంలోని మారుతినగర్, రాజారెడ్డివీధుల్లో ఫ్యామిలీ అడాప్షన్ ప్రోగామ్‌లో భాగంగా 2023 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులతో ప్రతి ఇంటిని సందర్శించి ఆరోగ్య విషయంగా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ సూపర్‌వైజర్లు గుల్జార్‌బేగం, సుబ్బరాయుడు, సర్వేశ్వర్ పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యం

వైవీయూ : ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడమే మనందరి లక్ష్యం కావాలని ఫిట్ ఇండియా ప్రోగ్రాం ట్రైనర్, ఫిజియోథెరపిస్టు పవన్ పేర్కొన్నారు. శనివారం కడప నగరంలోని ప్రభుత్వ కళాశాలలో ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా వ్యాయామం, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమికంగా చేయాల్సిన వ్యాయామాలు, ఆసనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్, ఫిజికల్ డైరెక్టర్ టి. హజరతయ్య పాల్గొన్నారు.

'ఆముదాల మురళి'కి మొల్ల పురస్కారం

కడప కల్చరల్ : తిరుపతికి చెందిన శతావధాని ఆముదాల మురళికి శనివారం కడప నగర పరిధిలోని సంస్థ కార్యాలయంలో మొల్ల సాహితీ పురస్కారం ప్రదానం చేశారు. మొల్ల సాహితీపీఠం ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు శాలువతో ఆముదాల మురళిని సత్కరించి జ్ఞాపిక, నూతన వస్త్రాలు అందజేశారు. ఆముదాల మురళి మాట్లాడుతూ మొల్లమాంబ పేరిట సాహితీ పురస్కారాన్ని తనకు ప్రదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, పీఠం ప్రతినిధులు బాబురెడ్డి, జయచంద్ర, లక్ష్మయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆముదాల మురళికి పురస్కారం అందజేస్తున్న గానుగపెంట హనుమంతరావు

'బ్రౌన్' సేవల గురించి తెలుసుకోవాలి

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ తెలుగుభాషకు చేసిన సేవల గురించి విద్యార్థులంతా తెలుసుకోవాల్సిన అవసరం ఉందని సీపీ బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ అన్నారు. శనివారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆయన మాట్లాడారు. కడప నగరం ఎర్రముక్కపల్లెలోని బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించి దాని ప్రాముఖ్యత తెలుసుకోవాలని, ఆ గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకోవాలని, అది విద్యార్థుల మనోవికాసానికి తోడ్పడగలదన్నారు. కడపలో బ్రౌన్ నివసించి సాహితీయజ్ఞం చేసి ఇంగ్లీషు, తెలుగు నిఘంటువు రూపొందించిన పవిత్ర స్థలం శిథిలాలపైనే ప్రస్తుతం ఆయన పేరిట రెండస్తుల భవనంలో గ్రంథాలయం ఉందన్నారు. ఇందులో పుస్తకాలే కాకుండా అపురూపమైన తాళపత్ర, తామ్రపత్ర గ్రంథాలు, పురాతన నాణెలు, పురాతన రాత పరికరాలు తదితరాలు ఉన్నాయని, దాదాపు లక్షకు పైగా పుస్తకాలు ఉన్నాయని వివరించారు. యువతీ యువకుల పోటీ పరీక్షలకు అవసరమైన ఎన్నో పుస్తకాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.రమణయ్య, బ్యాంకు అధికారి వినోద్‌కుమార్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కడప ఎడ్యుకేషన్ : కందుల గ్రూపు విద్యాసంస్థల మాజీ అధిపతి, మాజీ ఎమ్మెల్యే దివంగత కందుల శివానందరెడ్డి వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. మాజీ పార్లమెంట్ సభ్యులు రామమునిరెడ్డి, కందుల కుటుంబ సభ్యులు కేఎస్ఆర్ఎం ఘాట్‌లో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో భారతీ కంటి ఆసుపత్రి, బోగా పార్వతమ్మ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా 356 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 216 మంది రక్తదానం చేశారు.
అలాగే వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలతోపాటు నగదు బహుమతులను ప్రదానం చేశారు. తదనంతరం కొప్పర్తిలోని ఆశా నిలయంలో మానసిక వికలాంగులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కందుల రాజమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ కందుల మదన్‌మోహన్‌రెడ్డి, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, కేఓఆర్ఎం కళాశాల చైర్మన్ వెంకట శివారెడ్డి, వైస్ చైర్మన్ లిఖితారెడ్డి, వైఎస్సార్‌పార్టీ నాయకులు అఫ్జల్‌ఖాన్ పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి

10న సీపీ బ్రౌన్ జయంతి

కడప కల్చరల్ : తెలుగు భాషోద్ధారకుడు సీపీ బ్రౌన్ 225వ జయంతి ఉత్సవాన్ని ఈనెల 10వ తేదీ ఉదయం 10.00 గంటలకు బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించనున్నామని సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్, విశిష్ట అతిథిగా శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఆచార్య రాణి సదాశివమూర్తి, గౌరవ అతిథిగా వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య హాజరవుతారన్నారు.